
క్లుప్తంగా

ప్రచార హోర్డింగులు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



పద్మనగర్‌లో బస్‌స్టాప్‌కు తొలగించిన ఫ్లెక్సీ

తంగళ్లపల్లి: మండలంలోని ప్రధాన రహదారులపై రాజకీయ పార్టీల, ప్రభుత్వ ప్రచార హోర్డింగులు తొలగించలేదని తెలుపుతూ 'కోడ్ కూసినా నిద్రలేవలే..' అనే 'సాక్షి' కథనానికి బుధవారం అధికారులు స్పందించారు. ప్రధాన రహదారితోపాటు గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలు తొలగించారు.

పాఠశాల తనిఖీ



పాఠశాల రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పరీక్ష నిర్వాహణ, తరగతి గదులను పరిశీలించారు. పరీక్షలు జరగని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాక్ సెంటర్‌కు తాళం



ధర్నా చేస్తున్న మహిళలు

ముస్తాబాద్: మండల కేంద్రంలోని న్యాక్ శిక్షణ కేంద్రం ఎదుట మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా శిక్షణ ఇచ్చిన అధికారులు.. కొందరికి మాత్రమే కుట్టుమిషన్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవ శ్రీకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన న్యాక్ శిక్షణ కేంద్రానికి అద్దె చెల్లించకపోవడంతో నిర్వాహకులు తాళం వేశారని మహిళలు పేర్కొన్నారు. సెంటర్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. యాభై మంది నిత్యం శిక్షణకు వస్తుంటే.. 30 మందికి మాత్రమే కుట్టుమిషన్లు ఇచ్చారన్నారు. అధికారులు స్పందించి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్లు అందించాలని, ఫంక్షన్‌హాల్ అద్దె చెల్లించాలని కోరారు.

బతుకమ్మ చీరలతో రాజకీయాలు వద్దు



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలతో రాజకీయాలు వద్దని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల కార్మికులకు ఉపాధి నిమిత్తం ప్రతి ఏడాది బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేయిస్తుందన్నారు. దీనిపై కొందరు స్వార్థ రాజకీయ లబ్ధికి బతుకమ్మ చీరల ఉత్పత్తిలో అవినీతి జరిగిందని, నాణ్యత లేవని ఎక్కడి నుంచో తీసుకొచ్చిన చీరలను దహనం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలతో కార్మికుల మనోభావాలు దెబ్బ తీయడం సరికాదన్నారు. సీనియర్ నాయకులు సామల మల్లేశం, కడారి రాములు, రమేశ్ పాల్గొన్నారు.

వంతెనలు లేక అవస్థలు

- ఏళ్లు గడిచిన మోక్షం లేదు
- ప్రజల తప్పని తిప్పలు
- ప్రమాదకరంగా ప్రయాణాలు

ముస్తాబాద్: వానకాలం వచ్చిందంటే ఈ గ్రామాల ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిందే. ఏటా వరదలు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పాలకులకు, అధికారులకు మొర పెట్టుకోగా పంచాయతీరాజ్ ద్వారా మంజూరైన పనులకు మోక్షం కలగడం లేదు. గ్రామాల మధ్య పారుతున్న ఒర్రెలపై వంతెన లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు.



ప్రమాదకరంగా వున్న దారిలో నడుస్తున్న నిమ్మవానిపల్లె గ్రామస్తులు

ముస్తాబాద్ మండలం నిమ్మవారిపల్లె, ఆవునూర్ గ్రామాల మధ్య వున్న ఒర్రెపై వంతెన నిర్మించాలని ఏళ్లుగా ప్రజలు కోరుతూ వస్తున్నారు. పాలకులు మారిన తమ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.70 లక్షలు వంతెన నిర్మాణానికి మంజూరు చేయించారు. నిధులు వచ్చాయని సంతోషపడుతున్న క్రమంలో ఎంతకు పనులు మొదలుకాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది

గన్నెవారిపల్లె పంచాయతీ పరిధిలోని నిమ్మవారిపల్లె నుంచి ఆవునూర్, ముస్తాబాద్, పోతుగల్, నర్సింలుతండాకు వెళ్లాలంటే కొండ చెరువు నుంచి వచ్చే వరద నీటి ఒర్రెను దాటాలి. కొన్నేళ్లుగా భారీ వర్షాలతో కొండ చెరువు మత్తడిపోస్తుండడంతో ఒర్రె భారీ వరదతో ప్రవహిస్తోంది. దీంతో నిమ్మవారిపల్లె ప్రజల కోసం అక్కడ తాత్కాలికంగా పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. గన్నెవారిపల్లె సర్పంచ్ నాలుగేళ్లుగా ప్రతి సంవత్సరం పైపులు వేయించడం, వరదలకు కొట్టుకుపోవడం షరామాములయ్యింది. వానకాలంలో ఆవునూర్ నుంచి పోతుగల్‌కు వెళ్లడం కష్టమే. వాహనాలు నడిచే పరిస్థితి లేదని రాకపోకలను నిలిపివేస్తున్నారు. మరోవైపు ముస్తాబాద్ నుంచి ఆవునూర్ వెళ్లలన్న వరద కల్వర్టు తెగిపోవడంతో రవాణా స్థంభించిపోతుంది.

పనుల ఆలస్యంపై నిరసన

నిమ్మవారిపల్లె ఒర్రెపై వంతెన నిర్మాణ పనుల ఆలస్యంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మి అంటున్నారు. కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద ఎలా నడిచేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆటో కూడా నడవలేని పరిస్థితులున్నాయని అంటున్నారు. ఏఈ దృష్టికి తీసుకెళ్లిన పనులు మొదలు కాకపోవడంపై నిరసన తెలుపుతున్నారు. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏటా వర్షాకాలంలో నీటి కష్టాలు తప్పడం లేదంటున్నారు. వంతెన నిర్మాణంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వెళ్తారన్నారు. పాలాలకు కూడా రైతులు వెళ్లలేకపోతున్నారు.



ఇది రుద్రంగి మండల కేంద్రంలోని ఒకటో వార్డు రామకిష్టాపూర్, 14వ వార్డు మహాలక్ష్మీ కాలనీల మధ్య పారే ఒర్రె. ఇక్కడ హైలెవల్‌బ్రిడ్జి లేక ఆ కాలనీవాసులు, పొలాల వద్దకు పోయే రైతులు ఈ మురుగునీటిలో నుంచి వెళ్లాల్సిందే.

రుద్రంగి: రుద్రంగిలోని ఒకటో వార్డు రామకిష్టాపూర్, 14వ వార్డు మహాలక్ష్మీకాలనీల మధ్య గల ఒర్రెపై హైలెవెల్ బ్రిడ్జి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి వెలువడుతున్న మురుగునీరు ఒర్రెలోకి చేరి కంపుకొడుతున్నాయి. దుర్గమ్మ గుడికి వెళ్లే భక్తులు, పొలాలకు వెళ్లే రైతులు, రామకిష్టాపూర్, మహాలక్ష్మీకాలనీ ప్రజలు నిత్యం ఆ మురికినీటిలో నుంచి నడిచి వెళ్తున్నారు.

నిత్యం నరకమే..

దుర్గమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు, పంటపొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒర్రెపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తామని పాలకులు దశాబ్దకాలంగా హామీలతోనే సరిపెడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి లేకపోవడంతో గ్రామంలోని డ్రెయినేజీ మురుగునీరు పారుతున్న వాగులో నుంచి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ఒర్రెపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



ఆవునూర్, నిమ్మవారిపల్లె రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరైన పనులు మొదలు పెట్టలేదు. వంతెన నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. వెంటనే పనులు ప్రారంభించాలి.

– ఏనుగుల వేణు, ఆవునూర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం



నిమ్మవారిపల్లె వద్ద ఒర్రెపై వంతెన నిర్మించేందుకు డీఎంఎఫ్‌టీ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు బాగా ఉండడంతో పనులు ప్రారంభించలేదు. మూడు మీటర్ల లోతులో పనులు చేపడుతాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ప్రవీణ్, ఏఈ, పంచాయతీరాజ్, ముస్తాబాద్

ఒర్రె దాటడం కష్టంగా ఉంది



ఏ చిన్న పనికైన ఒర్రె దాటి వెళ్లాలి. ఊరిలోని డ్రెయినేజీ నీరు ఒర్రెలో చేరుతుంది. ఆ నీటిలో నుంచే రోజూ నడుచుకుంటూ వెళ్తుండడం కష్టంగా ఉంది. ఏళ్లుగా బ్రిడ్జి నిర్మిస్తామని చెబుతున్నారే తప్ప కట్టడం లేదు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

– పత్తిపాక అమృతవ్వ, రుద్రంగి

ప్రతిపాదనలు పంపాం



ఒర్రెపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. మంజూరు రాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– మనోహర్, పీఆర్ ఏఈ, రుద్రంగి

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో కేకే మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టనున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగిందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని, 2014, 2018 మ్యానిఫెస్టోలోని హామీలను ఎన్ని అమలు చేశారో బీఆర్‌ఎస్ నాయకులు చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వరంగల్ డిక్లరేషన్ అమలు చేసి రైతు, యువత, దళితులు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. రూ.4 వేల పెన్షన్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, అర్హులైన రైతులకు రుణాలు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. మళ్లీ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామానికి నలుగురు చొప్పున కార్యకర్తలే లబ్ధి పొందుతారని, అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేదకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పార్టీలో దాదాపు 150 మంది వరకు చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల శాఖ బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల మహిళ అధ్యక్షురాలు జోగుల మంజుల, లక్ష్మారెడ్డి, లెంకల లక్ష్మన్, తిరుపతి, రాజు, చంద్రమౌళి, రాములు, కాంతయ్య, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పతనం ప్రారంభమైంది'

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ విజయం బీఆర్‌ఎస్ పార్టీ పతనం ప్రారంభమైందని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బీఆర్‌ఎస్ నుంచి సొంతగూటికి వచ్చిన నేతలతో కలిసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలపై విశ్వసనీయతతో తమ పార్టీ విజయం ఖాయమైందన్నారు. అధికార పార్టీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయన్నారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ యెల్లె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సిరిసిల్ల బీఆర్‌ఎస్‌లో ఆరుగురు వ్యక్తులు మూలంగా ఆ పార్టీకి గడ్డురోజులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. తనకు గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టిక్కెట్ ఇచ్చి మరీ కక్షగట్టి ఓడించి రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో ఎమ్మెల్యే వ్యక్తిని ఓడించి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో చేరిన వైద్య సీనియర్ నేతలు వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ మాట్లాడుతూ తాము సుదీర్ఘకాలం పనిచేసిన కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, కాముని వనిత, గొట్టె రుక్మిణి, గోనె ఎల్లప్ప, ప్రశాంత్ పాల్గొన్నారు.

పోలీస్ తనిఖీల్లో అపశ్రుతి

- వాహనదారున్ని ఆపడంతో వివాదం
- జిల్లాలో పోలీసుల తీరుపై చర్చ

సిరిసిల్లక్రైం: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా చిన్నపాటి అపశ్రుతి చోటుచేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వాహనాలు తనిఖీ చేసే క్రమంలో ఓ వాహనదారుడు తన వాహనాన్ని నిలపకుండా వెళ్తుండగా.. గమనించిన విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఒకరు తన వద్ద ఉన్న కట్టెను అడ్డుగా పెట్టగా అది అతని చాతిపై తగిలింది. దీంతో వాహనదారుడు తనకు గాయాలైనట్లు నానా హంగామా చేయడంతో పోలీసులు అప్పటికప్పుడు తమకు తెలిసిన వైద్యుని వద్ద చికిత్స చేయించారు. వాహనదారుడికి ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారించుకొని ఇంటికి పంపించారు. అయితే తనిఖీల పేరిట తనపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై ప్రచారం చేస్తుండడం ఓ పోలీసు అధికారికి చేరింది. ఏదేని సమస్య ఉంటే చెప్పాలని, తనిఖీ విధుల్లో ఉన్న పోలీసులకు సహకరించాలని వాహనదారున్ని మందలించే ప్రయత్నం చేయగా తాను ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తానని, నిబంధనలు తెలుసునని ఇలా ఇష్టారీతిగా వ్యవహరించడం సరికాదని బాధితుడు పోలీసు అధికారికి చెప్పి వెళ్లాడు. పోలీసులు అడ్డుకునేందుకు కట్టె అడ్డుగా పెట్టడంతో బలమైన గాయాలైనట్లు జరుగుతున్న ప్రచారం నిజం లేదని పోలీసు అధికారులు తెలిపారు.

భక్తుడి బంగారం గోల?

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు సమర్పించిన బంగారు కానుకల విషయంలో వివాదాస్పదమైంది. వరంగల్‌కు చెందిన ఓ భక్తుడు రాజన్న మొక్కు చెల్లించుకునేందుకు 2 గ్రాముల బంగారాన్ని స్వామి వద్ద ఉంచి హుండీలో వేయాలని అక్కడే ఉన్న అర్చకుడిని కోరారు. భక్తుడి కోరిక మేరకు అర్చకులు సైతం ఆ బంగారాన్ని స్వామి వద్ద ఉంచి తిరిగి హుండీలో వేశారు. అయితే అర్చకులు ఆ బంగారాన్ని హుండీలో వేసినట్లు కనిపించలేదంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి భక్తులకు భరోసా కల్పించినట్లు తెలిసింది.

సంక్షిప్త వార్తలు

ఉపాధిహామీ కూలీకి అస్వస్థత

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేటకు చెందిన ఆవునూరి లింగయ్య అనే ఉపాధిహామీ కూలీ పనులు చేస్తుండగా బుధవారం అస్వస్తతకు గురయ్యాడు. వెంటనే తోటికార్మికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించారు. ఆయనకు బీపీ పడిపోవడంతో ఇలా జరిగిందని కార్మికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పి వెంటనే వైద్య సేవలు అందించారు.

మద్యం మత్తులో వీరంగం



వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మద్యం మత్తులో వ్యక్తి వీరంగం సృషించాడు. స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని శివపార్వతుల కాలనీకి చెందిన రాకేశ్‌కు వేములవాడ ఏరియా ఆసుపత్రిలో కుమారుడు జన్మించాడు. మద్యంతాగి ఆసుపత్రికి వచ్చిన రాకేశ్ ఆసుపత్రిలోని ఎవరులేని రూమ్‌లో డోరు పెట్టుకుని పడుకున్నాడు. రెండు గంటలు అయిన ఎంతకి తలుపు తీయకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది వెంటిలేషన్ ద్వారా లోపలికి వెళ్లి తలుపు తీసి రాకేశ్‌ను లేపడంతో మీరు ఎవరు నన్ను లేపుతున్నారని గొడవపడి సిబ్బందిని గాయపరిచాడు. దాంతో సంఘటన స్థలానికి వేములవాడ టౌన్ ట్రాఫిక్ ఎస్సై దీలిప్ కుమార్ రావడంతో గడవను సద్దుమనిగించారు.

కారెక్కిన గన్నమనేని

వేములవాడ: వేములవాడ మాజీ ఉపసర్పంచ్ గన్నమనేని రామారావు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వనించారు. అయితే ఆది శ్రీనివాస్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉన్న రామారావు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో చర్చనీయాంశమైంది.

వృద్ధులకు బట్టలు, భోజనం

తంగళ్లపల్లి: కన్న తల్లి చిలివేరు విజయ జ్ఞాపకార్థం హైదరాబాద్‌కు చెందిన ఏదనూరి రాజ్యలక్ష్మీ రవికుమార్ దంపతులు మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము, పెంటల రమేశ్, ఆశ్రమ ఇన్‌చార్జి మమత, వృద్ధులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా విజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

చందుర్తి: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో డీటీఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన 5వ రాష్ట్ర విద్యా, విజ్ఞానిక మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగ తిరుపతి కోరారు. మండలంలోని ఎన్గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మహాసభల వాల్ పోస్టర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునితరాణి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వాల్ రైటింగ్ తొలగింపు

బోయినపల్లి: ఎన్నికల కోడ్ మొదలు కావడంతో మండలంలో పలు గ్రామాల్లో రాజకీయ పార్టీ అభ్యర్థులకు సంబంధించిన గోడ రాతలు తొలగిస్తున్నారు. బుధవారం వెంకట్రావుపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది పలు పార్టీలకు చెందిన గోడ రాతలను సున్నంతో చెరిపేశారు.

ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన పెద్దూరి శివకుమార్ అనే వ్యక్తి ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన కొత్తూరి రమేశ్ ఇంట్లోకి మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా ప్రవేశించి దాడి చేసిన సంఘటనలో బుధవారం శివకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా పాత గొడవలున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకోని శివకుమార్ రాత్రివేళ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి కొట్టాడు. చంపుతానని బెదిరించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడండి

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు ఈ ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని డీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయడం జరుగుతుందన్నారు. అవినీతి కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని అన్నారు. బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమైందన్నారు. డబ్బులు, మద్యం పంపకాలకు అధికార పార్టీ ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటుందన్నారు. వారి అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలను సమాయత్తం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, రాజేందర్, శ్రీనివాస్, బాబు, పోచయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

వేములవాడ: వేములవాడ పట్టణంలోని విద్యానగర్‌లో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. పట్టణానికి చెందిన యెల్లస్వామి(24) బుధవారం రాత్రి ఇంట్లో వెల్డింగ్ పనులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మరణించినట్లు కాలనీవాసులు తెలిపారు.

తప్పిన విద్యుత్ ప్రమాదం

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో ఓ రైతుకు త్రుటిలో ప్రాణపాయం తప్పింది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చీకోడు గ్రామానికి చెందిన కరెడ్ల సంజీవ్‌రెడ్డి బుధవారం ఉదయం పొలానికి వెళ్లాడు. బోరు మోటారు పెట్టేందుకు వెళ్లిన సంజీవ్‌రెడ్డికి స్టార్టర్ బోర్డు వద్ద తీగలు పైకి తేలి వుండడాన్ని గమనించాడు. స్టార్టర్ బోర్డు నుంచి కరెంట్ తీగలను విద్యుత్ స్తంభం సపోర్టు తీగ వరకు ఇవ్వడాన్ని గమనించాడు. అప్రమత్తమైన దూరంగా జరగడంతో ప్రాణపాయం తప్పిందని సంజీవ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై కావాలనే కొంతమంది కక్ష కట్టి కరెంట్ తీగలను ఇలా ఏర్పాటు చేశారని ఆరోపించాడు. హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

ఆశీర్వాద సభకు తరలిరావాలి



ఎల్లారెడ్డిపేట: ఈ నెల 17న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. బుధవారం మాట్లాడుతూ ప్రజా ఆశీర్వాద సభకు కనీవిని ఎరుగని రీతిలో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం నుంచి 16 వేల మంది జనాన్ని తరలించే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాడుగుల మల్లేశం, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అందే సుభాష్, కొండ రమేశ్‌గౌడ్, మల్లారెడ్డి, అప్సరా ఉన్నాసా, ఎడ్ల లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



సంతకం చేస్తున్న డీడబ్లువో లక్ష్మీరాజం

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లఅర్బన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం ఆకాంక్షించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని కేజీబీవీ, చిన్నబోనాలలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికల హక్కులు, చట్టాలు, బేటీ బచావో- బేటీ పడావో తదితర అంశాల గురించి వివరించారు. బాలికలు వివక్షకు గురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి సమాచారం అందించాలని సూచించారు. హెల్పింగ్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డీటీవో ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పున్నం చందర్, అలువాల ఈశ్వర్, సఖి కేంద్రం నిర్వాహకులు బోనాల రోజా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య, మహిళ సాధికారత కేంద్రం జెండర్ అధికారిణి త్రివేణి, పాఠశాల ప్రిన్సిపాల్ జాక్వలీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, చైల్డ్ హెల్ప్‌లైన్ రేణుక పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ, మండలంలోని లింగన్నపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిజ్ఞ నిర్వహించారు.

వీర్నపల్లి: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు తుమ్మ శ్రీనివాస్, సీడీపీవో ఆనందిని, సూపర్‌వైజర్ రేణుక, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో శానిటేషన్ సిబ్బందిని పెంచాలి

సిరిసిల్లటౌన్: జిల్లా ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికుల పోస్టులను వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి ఎదుట నిరసన ప్రదర్శన అనంతరం మాట్లాడారు. 230 పడకల ఆస్పత్రిలో 75 పడకలకు సరిపడే సిబ్బందిచే పనులు చేయిస్తూ కార్మికులపై అధిక పనిభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆస్పత్రిలో పనిచేసే కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదంతో శానిటేషన్ ఉద్యోగుల సంఖ్య పెంచడం లేదన్నారు. సిబ్బంది కొరత కారణంగా కార్మికులకు అత్యవసర పరిస్థితుల్లో సెలవులు ఇవ్వడం లేదన్నారు. వెంటనే సిబ్బందిని పెంచకుంటే కార్మికులు సమ్మెకు వెళ్తారని హెచ్చరించారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతి, విజయ్, పద్మ, రజిత, లత పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899